జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 24-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 435 పేజీలు: 4 వెల : రూ.7



## మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం..
# హౌస్ అరెస్టు



* రైతులకు ఎరువులు అందించాలని సీతారాం ధర్నా
* పోలీసులతో తమ్మినేని వాగ్వాదం * సీతారాం ఇంటి దగ్గర ఉద్రిక్తత
* భారీగా మోహరించిన పోలీసులు

**శ్రీకాకుళం/ఆమదాలవలస, ఆగస్టు23(వార్త):** రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ ఆమదాలవలసలో మాజీ స్పీకర్, వైసీపీ నేత తమ్మినేని సీతారాం శనివారం ధర్నాకు దిగారు. పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు తరలివచ్చి ఆయనకు సంఘీభావం తెలిపారు. ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. తమ్మినేనిని అడ్డుకుని బలవంతంగా జీపులోకి పోలీసులు ఎక్కించి ఆయన ఇంటికి తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు, తమ్మినేని సీతారాం మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ్మినేని సీతారాంను హౌస్ అరెస్ట్ చేశారు. ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా భారీగా పోలీసులు మోహరించారు. విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు, అనుచరులు పెద్ద ఎత్తున తమ్మినేని సీతారాం ఇంటి వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## అన్నదాత సుఖీభవ.. డబ్బులు అందాయా?

* రైతులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ * సువర్ణపురంలో అన్నదాతలతో ముఖాముఖి * అన్నదాత సుఖీభవ ప్రయోజనం అందరికీ చేరేలా చర్యలు

**మందస, ఆగస్టు 23 (వార్త):** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకంలో ఒక్క లబ్ధిదారుడు మినహాయింపు కాకుండా అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శనివారం మందస మండలం సువర్ణపురం గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలోని పలువురు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారు అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు అందుకున్నారా లేదా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఎవరైనా లబ్ధిదారు డబ్బులు పొందకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కఠినంగా ఉండాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రైతులు పథకం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకోవడంతో వారంతా ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా కలెక్టర్ పలువురు విద్యార్థులతో ముచ్చటించారు. వారి భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, డీటీ కింతలి రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## జల్సాల కోసమే చోరీలు

* బైక్‌లు దొంగతనం చేసిన ఇద్దరు యువకులు * వారిని అరెస్టు చేసిన పలాస కాశీబుగ్గ పోలీసులు * వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు



**పలాస, ఆగస్టు 23(వార్త):** జల్సాల కోసం వరుస దొంగతనాలకు పాల్పడు తున్న ఇద్దరు యువ కులను అరెస్టు చేసి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. శనివారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఈ చోరీలకు సంబంధించి పలు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. యువకులు చెడు వ్యసనాలకు గురై డబ్బుల కోసం చివరికి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. టెక్కలి పట్నం గ్రామానికి చెందిన దొర సురేష్ మోటారుసైకిల్‌ను తన ఇంటిముందు రాత్రి పార్కింగ్ చేశాడు. ఆ మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి బైక్ కనబడలేదు. అలాగే గార మండలం, మెండపేట గ్రామానికి చెందిన వ్యక్తి తన అన్నయ్యకు చెందిన పల్సర్ మోటార్ సైకిల్‌ను తీసుకొని కాశీబుగ్గలో గల మల్లేశ్వరరావు హాస్పిటల్ దగ్గర పార్కింగ్ చేసి సొంత పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి నడచుకుని వెళ్లాడు. తిరిగి బండి పార్కింగ్ చేసిన ప్రాంతానికి వెళ్లగా బైక్ కనబడలేదు. వీరిరువురూ కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు బృందాలుగా ఏర్పడి శనివారం గరుడకండి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా బైక్‌లను తాము దొంగతనం చేసినట్టు అంగీకరించారు. గరుడకండి గ్రామానికి చెందిన కవిటీ నిఖిలేష్ సన్నాఫ్ మోహన్ కుమార్, ఒడిస్సా గజపతి జిల్లా కాశీనగరం గ్రామానికి చెందిన తూముల కార్తికేయ సన్నాఫ్ జగదీష్‌లు కలిసి ఈ ద్విచక్ర వాహనాలు దొంగతనాలు పాల్పడ్డారని డీఎస్పీ తెలిపారు. వీరిద్దరూ స్నేహితులని, శ్రీకాకుళంలోని ఓ స్కూల్‌లో కలిసి పదో తరగతి వరకూ కలిసి చదువుకున్నారన్నారు. వీరు చెడు అలవాట్లకు బానిసయ్యారు. మద్యం, గంజాయి తాగడం, ఆన్లైన్ బెట్టింగ్ ఆడడం వంటి చెడు అలవాట్లు ఉన్నాయి. జల్సాలకు డబ్బులు చాలకపోవడంతో మోటారు సైకిళ్లను దొంగతనం చేసేవారు. 2025 మార్చి నెలలో మొదటగా విశాఖపట్నం టౌన్, ఆరిలోవ ప్రాంతంలో ఒక మోటార్ సైకిల్ దొంగిలించారు. ఈ కేసులో వారు పోలీసులకు పట్టుబడ్డారు. ఈనెల 14న రాత్రి కవిటి నిఖిలేష్, తూముల కార్తికేయ మెలియాపుట్టి నుంచి పలాస వస్తూ టెక్కలి పట్టణంలో ఒక ఇంటి ముందు పార్కు చేసి ఉన్న స్కూటీని దొంగిలించారు. అలాగే ఈనెల 18న కాశీబుగ్గ టౌన్ మల్లేశ్వర రావు హాస్పిటల్ ముందు పార్క్ చేసి ఉన్న పల్సర్ మోటార్ సైకిల్ దొంగిలించారు. ఈ రెండు మోటారు సైకిళ్లను విశాఖపట్టణం తీసుకువెళుతుండగా పోలీసులు పట్టుకున్నారని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఇప్పటికీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు



* మహానటి అని ట్రోల్ చేయడం భావ్యమా? * వ్యక్తిగత కక్షతోనే నాపై ఎమ్మెల్యే దుష్ప్రచారం * నాపై ఆరోపణలు నిరాధారం * సీబీఐ, సీబీసీఐడితో విచారణ చేపట్టండి * తనకు న్యాయం చేయండి * కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య

**శ్రీకాకుళం, ఆగస్టు 23 (వార్త):** ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి వ్యక్తిగత కక్షతోనే నాపై దుష్ప్రచారం చేస్తున్నారని, అనుచరులతో మహానటి అని ట్రోల్ చేయిస్తున్నారని పొందూరు మండలం లోలుగు కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రేజేటి సౌమ్య అన్నారు. శనివారం తిలక్‌నగర్‌లోని తన స్వగృహంలో తల్లితో కలిసి మీడియాతో మాట్లాడారు. గత రెండు నెలలుగా నేను మానసిక వేదనను అనుభవిస్తున్నానన్నారు. 13 ఏళ్ల నుంచి లోలుగు కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నానన్నారు. గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదన్నారు. ఇప్పటికీ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన మాట వినలేదన్న కారణంగానే తనపై కక్షసాధింపు చర్యలు చేపట్టారన్నారు. కేజీబీవీలో ఏ రోజు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించలేదన్నారు. తనపై ఎప్పుడు ఎవరూ కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. ఇటీవల ఎమ్మెల్యే అనుచరుల ప్రోద్బలంతోనే కొందనే తనపై లేనిపోని ఆరోపణలు, ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. చివరకు ఈనెల 9న తనకు కంచిలి బదిలీ చేశారన్నారు. తాను ఎదురుతిరగడంతో అవమానాలకు గురిచేశారన్నారు. మూడు సార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి తన సమస్యలను ప్రస్తావించానన్నారు. సర్వశిక్ష అభియాన్ ఏపీసీ సైతం తనపై వ్యక్తిగత కక్ష పెట్టుకున్నారని, ఎమ్మెల్యే చెప్పింది వినాలంటూ తనపై ఒత్తిడి చేశారని వాపోయారు. తనను వేధించడంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేశానని, ఇది కూడా డ్రామా అని అంటున్నారని ఎమ్మెల్యే అనుచరులు ప్రచారం చేస్తున్నారని సౌమ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరి మహిళనైన తనకు పోరాడే శక్తి లేదని, న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. నాపై చేస్తున్న ఆరోపణలన్నీ నిరాధారమైనవని, సీబీఐ, సీబీసీఐడీతో విచారణ చేయిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయని సౌమ్య అన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## టంగుటూరు ప్రకాశం జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 23(వార్త):** ఇచ్ఛాపురం శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు స్కూల్ చైర్మన్ డి.కృష్ణ మూర్తి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా జేసీఐ నిర్వహించిన స్కాలర్‌షిప్ అప్టిట్యూడ్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శాంతి, యశోద, పార్వతి, ప్రమీల, స్నేహ, సరోజినీ, ఎస్పీఎల్స్ జి.హారిక, యువశ్రీ ఇంటరాక్ట్ ప్రెసిడెంట్ మోహన్‌ప్రియ, సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



# పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

## -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి -ఘనంగా వాడవాడలా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహణ

**నరసన్నపేట, ఆగస్టు 23 (వార్త):** నరసన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో జరిగిన స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని మాట్లాడారు. పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా మెలగాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





**ఎల్ఎన్ పేట, ఆగస్టు 23(వార్త):** లక్ష్మీనర్సుపేట మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అంటురోగాలు, ప్రకృతి వైపరీత్యాలు, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో ర్యాలీ జరిపారు. గ్రామస్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సామాజికవేత్త డా.ఎం.కె.మిశ్రో, హెచ్ఎం బి.రమాదేవి, ఉపాధ్యాయులు పి.లక్ష్మణ రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, ఆగస్టు 23(వార్త):** ఇచ్ఛాపురంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో శనివారం హాస్పిటల్ రోడ్ నుంచి పంజా వీధి మీదుగా ముడియా వీధి వరకు ర్యాలీ నిర్వహించారు. టెర్రస్ గార్డెనింగ్, హోమ్ కంపోస్ట్ చేసి, తడి చెత్తను తగ్గించాలని సూచించారు. ముడియా వీధిలో ఓ ఇంటి వద్ద టెర్రస్ గార్డెనింగ్‌ను సందర్శించి, నిర్వాహకులను అభినం దించారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ స్థానిక సీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి రాజు, తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జైదేవ్, ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. డొంకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి అధ్యక్షతన ముఖ్య అతిథులు డిప్యూటీ ఎంపీడీవో వెంకటరావు, గ్రామ పంచాయతీ సెక్రటరీ కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించి, మానవహారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.జానకీరావు, ఉపాధ్యాయులు ఎల్.గోవిందరావు, శ్రీహరి, ఎంపీడీవో కార్యాలయ, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ హెల్త్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.






**పలాస, ఆగస్టు 23(వార్త):** పరిసరాలు పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర సాధ్యమని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శనివారం పలాస-కాశీబుగ్గలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నర్సిపురం, కాశీబుగ్గ పాత బస్టాండ్‌లో గల సులభ్ కాంప్లెక్స్, అన్న క్యాంటీన్ ఏరియా, కేటీ రోడ్, కాశీబుగ్గ మార్కెట్ ఏరియా, పలాస ముత్యాలమ్మ కోనేరు, పురుషోత్తపురం ఏరియాల్లో స్ప్రేయింగ్ చేపట్టారు. ర్యాలీలను నిర్వహించి, ఇంటింటికి వెళ్లి నీరు నిల్వ ఉండడంతో జరిగే ప్రమాదాలపై వివరించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉదయ్ పాత్ర, వెంకటే శ్వర్లు, శానిటరీ కార్యదర్శులు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయం వద్ద విస్తృతంగా శ్రమదానం జరిపారు. పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థాలను తొలగించడం, పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంత్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠ రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## సాయినగర్‌లో పశువులను కట్టడి చేయండి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 23(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 10వ వార్డు సాయినగర్‌లో పశువులను కట్టడి చేయాలని వార్డు తెలుగుదేశం ఇన్‌చార్జి నందికి జానీ, వై.లింగరాజు కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు శని వారం వారు వినతిపత్రం అందజేశారు. ఆవులు, గేదెలు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నా యన్నారు. సంబంధిత యజమానులు వాటిని విడిచిపెట్టడంతో పర్యావ రణ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కాలువలు అభివృద్ధి చేయాలని కోరారు.

## శతాధిక వృద్ధురాలు అప్పోజమ్మ మృతి



**మందస, ఆగస్టు 23(వార్త):** శతాధిక వృద్ధు రాలు కాసులదేవు అప్పోజమ్మ(101) శనివారం మృతిచెందారు. హరిపురం గ్రామానికి చెందిన అప్పోజమ్మకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరితో ఎంతో చక్కగా ఉండే అప్పోజమ్మ మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## వంశధార పేపర్ మిల్లులో ప్రమాదం.. ఒకరి మృతి



**నరసన్నపేట, ఆగస్టు 23 (వార్త):** మడపాం వంశధార పేపర్ మిల్లులో ప్రమాదవశాత్తూ ఓ కార్మికుడు మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం మిల్లులో నిల్వ చేసిన టన్నుల ఊక ఒక్కసారిగా కార్మికుడు వాసు(45)పై పడిపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నదే గ్రామానికి చెందిన వాడిని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

## బిటివాడ హెచ్ఎం రత్నాకరరావుకు ఘన సన్మానం

**వీరఘట్టం, ఆగస్టు 23(వార్త):** పార్వతీపురం మన్యం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రత్నాకరరావును శనివారం పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని వక్తలు కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ, సంఘ పటిష్టతకు నిరంతరం శ్రమిస్తా నన్నారు. అంతకుముందు రత్నాకరరావును దుశ్సాలువాతో సత్కరించి, మెమెంటోని బహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల కార్యదర్శి సిర్లాపు ఉమా మహేశ్వరరావు, బిటివాడ గ్రామ పెద్ద లింగాల రాజారత్నకుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సతివాడ రమాదేవి, శ్రీరామ్ జగదీష్‌కుమార్, ఉపాధ్యాయులు వెంకటరమణ, చిన్నారావు, శ్రీనివాసరావు, పురుషోత్తం, మోహనరావు, గంగు మోహనరావు, పావని, సిబ్బంది గౌరి, నీలమ్మ, కమలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 25న సాయిశిరీషలో మెగా జాబ్‌మేళా



**పలాస, ఆగస్టు 23(వార్త):** పలాస నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 25న మెగా జాబ్‌మేళాను కాశీబుగ్గ సాయిశిరీష కళాశాలలో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే శిరీష తెలిపారు. ఈ మేళాలో 750కి మందికి పైగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఏడాది కాలంలో ఇప్పటికే 500 మందికి పైగా ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే సంక ల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.




## ఘనంగా నేషనల్ స్పేస్ డే

**పలాస, ఆగస్టు 23(వార్త):** పలాసలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డే కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్‌డేని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల ప్రాముఖ్యత, దేశం ఈ రంగంలో సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు బి.గాయత్రి, బి.రూప, సౌమ్య నాయక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈ భౌతిక శాస్త్ర అధ్యాపకుడు హేమాచలం, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, లైబ్రేరి ఎన్.నరసింహులు, పీడీ డాక్టర్ మధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ హాజరు తప్పనిసరిగా వేయాలి



**పలాస, ఆగస్టు 23(వార్త):** అధ్యాపకులు ప్రతీరోజు కళాశాలకు ఉదయం 9 గంటలకు సాయంత్రం 5 గంటలకు ముఖ హాజరు తప్పనిసరిగా చేయాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎ.సురేష్ కుమార్ అన్నారు. శనివారం ఆయన వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి కళాశాల రికార్డులు, అధ్యాపకుల టీచింగ్ డైరీస్ పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రయోగశాలలను పరిశీలించి ఎప్పటికప్పుడు ప్రయోగాలు విద్యార్థులకు చెప్పాలన్నారు. ఆయన వెంట కళాశాల అధ్యాపకులు కేశవరావు, జాన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం



**మందస, ఆగస్టు 23(వార్త):** మందసలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంస్కృత భాషా దినోత్సవం సంస్కృత ఉపాధ్యాయురాలు పి.టి.జి.గైర్వాణీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంస్కృత భాషా ప్రధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పి.మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, మూర్తి, నారాయణరావు, కృష్ణారావు, దుర్గాప్రసాద్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## రెండు బార్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 23(వార్త):** ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు మద్యం బార్‌లకు దరఖాస్తులు కోరుతున్నట్లు సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టవచ్చన్నారు. లైసెన్స్ ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలుగా నిర్ణయించారన్నారు. ఈ మేరకు మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. మూడేళ్ల పాటు బార్ పాలసీ అమలులో ఉంటుందన్నారు. 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారని తెలిపారు. నిర్ణీత దరఖాస్తులు రాకపోతే 5లక్షల రుసుం వాపస్ చేస్తామని చెప్పారు. ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 వరకు బార్‌లు నడపవచ్చన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ 26 కాగా లాటరీ 28న తీస్తారని చెప్పారు.



# డీఎస్సీలో మెరిశారు..!

### -ఫస్ట్ ర్యాంక్ సాధించిన శైలజ



**మెళియాపుట్టి, ఆగస్టు 23 (వార్త):** డీఎస్సీ-2025 స్కూల్ అసిస్టెంట్ పరీక్ష ఫలితాల్లో మారేడ కోట గ్రామానికి చెందిన మజ్జి శైలజ జిల్లాలో 5వ ర్యాంక్ సాధించగా మహిళా కేటగిరిలో మొదటి ర్యాంకును సాధించినట్లు తండ్రి వీరన్న తెలిపారు. శైలజ మొదటి ర్యాంకు సాధించడంపై కుటుంబీకులు, సన్నిహితులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఆమెను అభినందించారు. మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

### -ఐదో ర్యాంకర్‌గా రావులవలస మహిళ



**నరసన్నపేట, ఆగస్టు 23 (వార్త):** రావులవలసకు చెందిన ముద్దాడ రమ్య డీఎస్సీలో బయాలజీ విభాగంలో 84.8 మార్కులతో (స్కూల్ అసిస్టెంట్) జిల్లాలో 5వ ర్యాంక్ సాధించారు. ఆమె ప్రతిభపై భర్త ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ బాధ్యతలు మోస్తూ కష్టపడి చదివానని రమ్య తెలిపారు.

### -జిల్లా మొదటి ర్యాంకర్ శంకరరావుకు అభినందన



**మందస, ఆగస్టు 23(వార్త):** మెగా డీఎస్సీ-2025 ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో 86.7 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంక్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ జోన్-1లో జిల్లా 4వ ర్యాంక్‌తో రెండు ఉద్యోగాలు సాధించిన మజ్జి శంకరరావును అంబుగాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. యువత శంకరరావును ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంబుగాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాసం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గున్న రమేష్, గొల్లంగి సాయమ్మ, దాసరి ఈశ్వర రావు, పత్రి ఈశ్వరరావు, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

### బొడ్డపాడు గ్రామస్తులు ముగ్గురికి పోస్టులు





**పలాస, ఆగస్టు 23(వార్త):** మెగా డీఎస్సీలో బొడ్డపాడు గ్రామస్తులు ముగ్గురికి పోస్టులు రావడంతో పలువురు గ్రామస్తులు అభినందించారు. బొడ్డపాడు గ్రామానికి చెందిన ఎరుమాకు భార్గవ్ హైస్కూల్ పీఈటీగా, సంక కృష్ణప్రసాద్ సెకండ్ గ్రేడ్ టీచర్‌గా, కింతల రవికుమార్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. వీరికి బొడ్డపాడు మాజీ యువజన సంఘం అధ్యక్షులు కిక్కిర ఢిల్లేశ్వరరావు అభినందనలు తెలిపారు.

### -సత్తా చాటిన మబగాం వాసి



**పోలాకి, ఆగస్టు 23(వార్త):** మబగాం గ్రామానికి చెందిన ఎన్.విజయభాస్కర్ డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ఎనిమిదో ర్యాంకు, టీజీటీలో జోన్ - 1లో తొమ్మిదో ర్యాంకు సాధించారు. విజయ్ ర్యాంక్ సాధించడంపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# జనపదమే.. జానపదం

### -బహడపల్లిలో ఘనంగా జానపద దినోత్సవం



**మందస, ఆగస్టు 23(వార్త):** బహడపల్లిలో ప్రపంచ జానపద దినోత్సవం సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రమజీవుల కష్ట సుఖాల నుంచి పుట్టినదే జానపదమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మానవతా విలువలను మానవ సంబంధాలను పెంపొందించడానికి జానపదాలు దోహదపడతాయన్నారు. ఆది మానవుడు ప్రకృతి అందాలకు పరవశించి పాడిన జానపదాలు మొదలుకుని సుబ్బారావు పాణిగ్రాహి రాసిన జముకుల కథ, వంగపండు ప్రసాదరావు రాసిన భూభాగోతం లాంటి జానపదాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాయన్నారు. జానపదాలను అందరి సహాయ, సహకారాలతో కాపాడే ప్రయత్నం సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక చేస్తుందన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మొదటి బహు మతి యు.సంధ్య(గీతం హైస్కూల్, హరిపురం), రెండవ బహుమతి ఆర్.వర్షిత (జెడ్పీహెచ్ స్కూల్, హరిపురం), మూడవ బహుమతి పి.దీక్షిత(గీతం హైస్కూల్, హరిపురం), నాలుగవ బహుమతి టి.హని(జెడ్పీహెచ్ స్కూల్, గరుడబద్ర) గెలుచుకున్నారు. సామాజిక, జానపద పాటల పోటీల్లో మొదటి బహుమతి కోనారి హేమసూదన్(బెండి), రెండవ బహుమతి నక్క వాసు(లొహరిబంద), మూడవ బహుమతి చెల్లూరి జయంత్(బైపల్లి) కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు, రేలారేరేలా రఘు, పూర్వ అధ్యక్షుడు రాపాక ధనరాజు, కోశాధికారి గొరకల లోకేశ్వరరావు, కుత్తుం వినోద్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, మాజీ ఎంపీటీసీ సాలిన మాధవరావు, దున్న రామారావు, బత్తిన రామారావు, పుక్కాళ్ల రాజేంద్ర, తామాడ ప్రదీప్, మామిడి గణపతి, చెల్లూరి నీలకంఠం, సాలిన పాపారావు, చెల్లూరి ఖగేష్, బత్తిన వెంకట రావు, రత్నాల భీమారావు, బత్తిన శాంతారావు, గ్రామ పెద్దలు సాలిన ఉమాపతి, రాపాక కేశవరావు, కర్రి తాతారావు, కొంచాడ బుజ్జి, సాలిన జోగారావు తదితరులు పాల్గొన్నారు.



## అధికారులు మండల సమావేశాలకు తప్పక హాజరు కావాలి



**పలాస, ఆగస్టు 23(వార్త):** మండల స్థాయి అధికారులు అంతా తప్పక హాజరు కావాలని వైసీపీ అధికార ప్రతినిధి, చినంచల ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు కోరారు. శనివారం ఆయన స్థానిక ప్రగతి భవన్లో విలేకరులతో మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు రాకపోవడంతో సమస్యలు చెప్పుకోవడానికి అవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తగిన సమాధానము దొరకడం లేదన్నారు. ఈనెల 26న జరగనున్న సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ రాకపోతే రచ్చ చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యుత్, రెవెన్యూ, వైద్యం, తాగునీరు వంటి శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో గ్రామాల్లో ప్రజాప్రతినిధులమై ఉండి కూడా సమస్యలు పరిష్కరించుకోలేకపోతున్నామని మండిపడ్డారు. ఈ మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకాకపోతే బహిష్కరిస్తామని ఘాటుగా హెచ్చరించారు.

# తెలుగుదేశం ఎంపీటీసీ దంపతులపై దాడి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 23(వార్త):** మండపల్లి పంచాయతీ ఎం.తోటూరు గ్రామంలో తెలుగుదేశం ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపి, ఆయన భార్య, ఎంపీటీసీ మాజీ సభ్యు రాలు కాళ్ల నీలవేణిపై దాడి జరిగినట్లు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వగాధ నరసింహమూర్తి దాడి చేసి గాయపరిచినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి రూరల్ ఎస్ఐ ఎం.ముకుంద రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలాగే వగాడ నరసింహమూర్తిపై కూడా దాడి జరిగినట్లు మరో కేసు నమోదైంది. గొల్ల వీధిలో వగాడ నరసింహ మూర్తి, బావమరిది కొరికాన నరేష్, ఆయన భార్య కొరికాన జ్యోతిపై కూడా దాడి చేసి, గాయపరిచినట్లు మరో కేసు టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైంది. కేసును టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరువర్గాలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పాత కక్ష్యల నేపథ్యంలో దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు.

# నూతన మూల్యాంకనం బోధనకు గొడ్డలి పెట్టు

**-ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ**



**ఎల్ఎన్ పేట, ఆగస్టు 23(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రవేశపెడుతున్న మార్పులన్నీ ఉపాధ్యాయుల బోధన సమయాన్ని తగ్గిస్తున్నాయని, తరగతి గదికి దూరం చేస్తున్నాయని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ అన్నారు. శనివారం ఆయన లక్ష్మీనర్సుపేట మండలంలోని బొర్రంపేట, శ్యామలాపురం, మల్లికార్జునపురం, చింతలబడవంజ, దొంకలబడవంజ, కరకవలస పాఠశాలలను సందర్శించారు.

ఈ సందర్భంగా కరకవలస నందు ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ సంస్కరణలు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడానికి గాకుండా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం తగ్గించేందుకు ఉపయోగపడుతున్నాయని విమర్శించారు. మూల్యాంకన పుస్తకాల్లో మార్పులు చేప ట్టాలని, ఒకటి, రెండు తరగతులకు ఓఎంఆర్ బబ్లింగ్ రద్దు చేయాలని, అపార్ ఐడి, పేపర్ కోడింగ్ బబ్లింగ్ తీసేయాలని కోరారు. డీఎస్సీ ప్రక్రియలో అభ్యర్థులకు ఉన్న అయోమయాలన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్టీయూ మండల నాయకులు పి.రామకృష్ణ, ఎ.వెంకట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మెట్టూరులో శివాంజనేయ ఆలయ నిర్మాణంపై వివాదం



**కొత్తూరు, ఆగస్టు 23 (వార్త):** మెట్టూరు బిట్-1 పరిధిలోని నిర్వాసిత గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా నిర్మిస్తున్న శివాంజనేయస్వామి ఆలయం నిర్మాణం వివాదాస్పదంగా మారింది. దీంతో శనివారం ఆ గ్రామ సర్పంచ్ ఎ.శంకర్, ఆ గ్రామ పెద్దలు కలిసి వెళ్లి వివాదానికి కారణమైన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవా లని కొత్తూరు తహసీల్దార్ కె.బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ ఆల యం అక్రమ నిర్మాణం అంటూ అధికారులు తొమ్మిది మందికి నోటీసులు జారీ చేయడం పై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. గుడి నిర్మాణం మొత్తం గ్రామానికి సంబంధించినదే గాని వ్యక్తిగత ప్రయోజనమేమీ లేదనే విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు.

నోటీసుల నిలుపుదలతో పాటు ఆలయ నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




## ప్రజా స్నేహితులుగా పోలీసులు

**-ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు**

**మందస, ఆగస్టు 23(వార్త):** విధుల్లోనే కాదు.. సేవల్లో కూడా ముందున్నా మంటున్నారు మందస పోలీసులు. మందస ఎస్ఐగా కె.కృష్ణప్రసాద్ బాధ్యతలు స్వీకరించాక పోలీసులు ప్రజల స్నేహితులుగా మారుతున్నారు. ఉద్దాన ప్రాంతంలో జీడితోటల మధ్య నుంచి ప్రమాదకరమైన మలుపులున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. మందస పోలీసు స్టేషన్ ఆవరణలోని పరిసరాలను శుభ్రపరిచారు. పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తా, చెదారాన్ని తొలగించి, క్లీన్‌అండ్‌గ్రీన్‌గా మార్చారు.

## చంద్రబాబు పాలనలో ప్రజలకు కన్నీళ్లే

**- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**




**కొత్తూరు, ఆగస్టు 23 (వార్త):** చంద్రబాబు పాలనలో పేదల సంక్షేమం పూర్తిగా విస్మరించబడిందని, కేవలం తన, తన కుటుంబ సభ్యుల స్వలాభం కోసమే ఆయన పాటుపడుతున్నారని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టకుండా, తన కొడుకు లోకేష్‌ను రాజకీయంగా నిలబెట్టేందుకే తపిస్తున్నాంన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, దీని ద్వారా అక్రమ సంపాదనకు పాల్పడుతు న్నారన్నారు. అధికార దుర్వినియోగంతో నిరంకుశ పాలన చేస్తున్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయింది, ఎక్కడ చూసినా అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయి. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఇప్పుడు వాటిని చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 'రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ చంద్రబాబు నాయుడే బాధ్యత వహించాలని, ఆయన నిరంకుశ పాలన త్వరలో అంతం అవుతుందన్నారు. "ప్రజలు అంతా గమనిస్తున్నారు, వారికి తగిన బుద్ధి చెప్పడానికి సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడి గోవింద్‌కు అక్రమార్జనపై ఉన్న దృష్టి.. నియోజకవర్గ అభివృద్ధిపై లేదన్నారు. ఎంతసేపు మద్యం, ఇసుక వ్యాపారాల్లో సంపాదనలో బిజీగా ఉన్నారని ఆరోపించారు.

## దివ్యాంగుల పింఛన్ల తొలగింపు నీచం



**సరుబుజ్జిలి, ఆగస్టు 23(వార్త):** దివ్యాంగులకు పింఛన్లకు అనర్హులుగా పేర్కొంటూ నోటీసులు ఇవ్వడం చాలా నీచమైన చర్య సరుబుజ్జిలి మండల వైసీపీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాదిన్నర కాలం గడుస్తున్నా కొత్త పింఛన్లు ఇవ్వలేదు గానీ, ఉన్నవి తొలగిస్తున్నారని మండిపడ్డారు. దివ్యాంగుల తరఫున పోరాటం చేస్తామన్నారు.

## కష్టసమయంలో అండగా భగత్‌సింగ్ ట్రస్ట్

**కొత్తూరు, ఆగస్టు 23 (వార్త):** లబ్బ గ్రామానికి చెందిన నిమ్మక సురేష్ భార్య రజనీ (క్యాన్సర్‌బాధితురాలు) ప్రస్తుతం విశాఖపట్నం పినాకిల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. పది రోజులకు ఒకసారి కీమోథెరపీ తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో, కొన్ని రోజులుగా రజనీ అక్కడే ఉన్నారు. ఈ క్రమంలో భోజనార్థం ఆసుపత్రి వెలుపలకు వచ్చిన సురేష్‌ని ఒక వాహనం ఢీకొనడంతో ఆయన కాలి ఎముక విరిగింది. ఇలా దంపతులిద్దరూ ఆసుపత్రి పాలవ్వడంతో ఆ కుటుంబం అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. కనీస ఆహారం, వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీ భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వెంటనే ముందుకు వచ్చారు. లబ్బ గ్రామానికి వెళ్లి సురేష్ తల్లి చేతికి రూ.20 వేల ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఇలాంటి కష్టసమయంలో ఆపన్న హస్తం అందించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546